క్లుప్తంగా

ఆకట్టుకున్న చిల్డ్రన్ క్లబ్



క్రిస్మస్ గురించి వివరిస్తున్న గ్రంథపాలకురాలు

నర్సీపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు దమయంతి చిన్నారులతో క్రిస్మస్ కేక్ కట్ చేయించారు. క్రిస్మస్ విశిష్టత గురించి వివరించారు. ప్రతి పండగలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చదవటంపై మక్కువ పెంచుకుంటే కచ్చితంగా విద్యలో రాణిస్తారని సూచించారు. అనంతరం మాస్ రీడింగ్‌పై తర్ఫీదు ఇచ్చారు. వారితో కథల పుస్తకాలను చదివించారు. అనంతరం కేక్, చాకెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు భారీగా తరలి రావాలి

మాకవరపాలెం: సాధికార బస్సుయాత్రకు భారీగా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పిల్లా శ్రీను కోరారు. జి.కోడూరులో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో ఈ నెల బస్సుయాత్ర నేపథ్యంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. దీనికి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెలగా వెంకటరమణ, బొడ్డేటి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఆటోడ్రైవర్లు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో ఆటోడ్రైవర్ల కుటుంబాలు ఎంతో ఆనందంగా జీవిస్తున్నాయని ఆనందపురానికి చెందిన విఘ్నేశ్వర ఆటోడ్రైవర్ల, ఓనర్ల కుటుంబాల అధ్యక్షుడు రంధి రాజునాయుడు తెలిపారు. ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆటోడ్రైవర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏటా వాహనమిత్ర పథకంతో రూ.10 వేలు అందించడంతో పర్మిట్లు కడుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా ఇక్కడా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయాన్ని తీసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు కె.అమ్మతల్లి, సిహెచ్.వెంకటరమణ, చండీరావు, దేముడునాయుడు, మస్తాన్. వి.శ్రీను పాల్గొన్నారు.


వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



రావికమతంలో మాట్లాడుతున్న ఏవో రూప

రావికమతం: రైతులకు సమగ్ర వ్యవసాయ సూచనలు చేసేందుకు గానూ ఆదివారం నుంచి వికసిత భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు ఆదివారం నుంచి మండలంలో ప్రారంభమయ్యాయి. రావికమతం సభలో వ్యవసాయాధికారి రూప పాల్గొని వ్యవసాయంలో డ్రోన్ల ఉపయోగం, పీఎం కిసాన్ కార్డులు గురించి వివరించారు. మండల పరిషత్, ఆరోగ్య శాఖ, సివిల్ సప్లయ్, తపాలా శాఖ, గృహ నిర్మాణం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయా శాఖల ద్వారా అందుతున్న సేవలు గురించి వివరించారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక



తమ్మునాయుడు



మామిడి రమణ

రోలుగుంట: బీజేపీ మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం రోలుగుంటలోని కార్యకర్తల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్రి తమ్మునాయుడు, ప్రధాన కార్యదర్శిగా మామిడి రమణ, ఉపాధ్యక్షుడిగా రేవళ్ల రాముడు, కోశాధికారిగా బొబ్బిలి సాంబమూర్తి, ఇతర కార్యవర్గాన్ని నియమించినట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.రాజేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలగాని ఈశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ తెలిపారు.



క్షురకులకు జగనన్న చేదోడు

పల్లెలోని రచ్చబండ వద్దనో, మర్రిచెట్టు కిందనో క్షుర పనిని చేయడం, చంకలో వృత్తిసామగ్రిని పట్టుకుని ఆయా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లడం వంటి జమానా నాటి గురుతులు దాదాపుగా చెరిగిపోయాయి. గ్రామం చిన్నదైనా చెక్కబడ్డీలోనైనా సెలూన్‌ను నిర్వహించే రోజులివి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కొంతమేరకు 'చేదోడు'గా ఉండటంతో నయా సెలూన్ (క్షౌరశాల)ల ఏర్పాటు చేసుకున్న నాయీ బ్రాహ్మణులు వేన్నీళ్లకు చన్నీళ్ల తోడు అన్న చందంగా దినదిన ప్రవర్ధమానం చెందుతున్నారు.

- ఏటా రూ.10 వేల సాయం
- గ్రామాల్లో వెలసిన నయా సెలూన్లు
- ఆర్థికాభివృద్ధిలో నాయీబ్రాహ్మణులు

చోడవరం రూరల్: జగనన్న చేదోడు పథకంలో నాయీ బ్రాహ్మణులకు ఇంత వరకు నాలుగేళ్లలో ఒక్క చోడవరం మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు చెందిన 26 గ్రామ సచివాలయాల పరిధిలో రూ.49.70 లక్షల సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమయ్యింది. ఎటువంటి కమీషన్లకు పైరవీలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా అందిన ఈ మొత్తాన్ని లబ్ధిదారులు తమ వృత్తికి చేదోడుగా మలుచుకుంటున్నారు. ప్రతిపక్షాల విమర్శకుల నోళ్లు మూయించేలా తమ సెలూన్లలో నూతన పరికరాలు, ఫ్యాషన్ సామగ్రి కొనుగోలుకు వెచ్చిస్తున్నారు.

గత ప్రభుత్వంలో నాసిరకం పనిముట్లు...

గత ప్రభుత్వం నాసిరకం పనిముట్లు కొనుగోలు చేసి వీరిపై ఎంతో ఆదరణ చూపుతున్నట్టు ప్రచారం చేసుకున్నాయి. అవి రెండు, మూడు వేల రూపాయల విలువ కూడా చేయబోవని విమర్శిస్తున్నారు. కొందరు వృత్తికారులు ఈ సొమ్మును బ్యాండు మేళం పనిముట్లు కొనడానికి సైతం వాడుకుంటున్నారని చెబుతున్నారు. క్షురక కర్మ కోసం పల్లెల్లో ఆరుబయట నేలపై కూర్చునే రోజులు పోయి తాము ఏర్పాటు చేసుకున్న సెలూన్లలో దర్జాగా తిరుగుడు కుర్చీలో కూర్చుని అధునాతన పనిముట్లతో చేసుకోవడం అభివృద్ధి కాదా అంటూ నాయీ బ్రాహ్మణులు ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నిస్తున్నారు.



చోడవరంలోని నయా సెలూన్



సెలూన్‌లో వృత్తిపని చేస్తున్న క్షురకుడు అప్పారావు

మండలంలో నాలుగేళ్లలో నాయీ బ్రాహ్మణులకు కలిగిన లబ్ధి

సచివాలయం పేరు	2020	2021	2022	2023
	లబ్ధి పొందిన వారి సంఖ్య			
అడ్డూరు	5	16	9	9
అంభేరుపురం	12	12	12	12
అంకుపాలెం	4	4	3	4
చాకిపల్లి	8	9	8	9
చోడవరం-1	5	4	2	2
చోడవరం-2	0	2	2	2
చోడవరం-3	4	4	4	4
చోడవరం-4	6	6	4	4
చోడవరం-5	15	11	13	13
దుద్దుపాలెం	3	2	1	1
గజపతినగరం	2	2	2	2
గంధవరం	4	3	4	4
గాంధీగ్రామం	1	1	1	0
గవరవరం	5	5	6	6
గోవాడ	8	9	8	9
గౌరీపట్నం	2	2	2	2
జన్నవరం				
జుత్తాడ	2	2	2	2
ఖండిపల్లి	3	3	3	3
లక్కవరం	5	5	6	6
లక్ష్మీపురం	6	6	8	8
ముద్దుర్తి				
నర్సయ్యపేట	6	6	6	6
రాయపురాజుపేట	2	2	2	2
వెంకన్నపాలెం	8	8	8	8
భోగాపురం	6	6	5	6
మొత్తం	122	130	121	124

గతంలో కమీషన్ పాలన



ప్రభుత్వం ఏటా ఇస్తున్న రూ.10 వేలు నా సెలూన్ అవసరాలకే వాడుకుంటున్నాను. ఇదిగాకుండా మాకు అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా నగదు వస్తోంది. ఈ డబ్బు ఎవడు పాడు చేస్తాడు. బాధ్యత లేనోడే అలా చేస్తాడు. గతంలో పరికరాలు ఇవ్వడంతో కమీషన్లు దండుకునేవారు. ఇప్పుడు ఎటువంటి కమీషన్లు లేకుండా నగదు ఇవ్వడం బాగుంది.

కోనేటి అప్పారావు, ఎడ్లవీధి, చోడవరం

కొత్తగా సెలూన్ పెట్టుకున్నా..



నేను ఇంత వరకు మా మామయ్య షాపులో వృత్తి పని చేసుకునే వాడిని. ప్రభుత్వం సాయం అందిస్తుందని తెలిసి రూ.50 వేలతో చోడవరం లక్ష్మీటాకీసు రోడ్‌లో సెలూన్ పెట్టుకున్నాను. ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వడం వల్ల మాలాంటి వృత్తిదారులకు ఎంతో ఉపయోగం. నాకు ఇంతవరకు సాయం అందలేదు. దరఖాస్తు చేసుకున్నాను. నాకు రాకున్నప్పటికీ రూ.10 వేలు అందించి ప్రభుత్వం నిజంగా చేదోడుగా ఉంటుంది. ఇది మంచిదే.

కాతా రాము, గోవిందమ్మ కాలనీ, అంకుపాలెం

కార్పొరేషన్ రుణాలిస్తే మరింత మేలు...



నేను చోడవరం దరి అంకుపాలెం రోడ్డులో ప్రభుత్వ పాఠశాల వద్ద సెలూన్ నడుపుతున్నాను. ప్రభుత్వ అందించే సాయంతో నాయీ బ్రాహ్మణులకు మేలు కలుగుతోంది. మరికొందరికి అందించాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్ రుణం అందిస్తే మరింత మేలు చేకూరుతుంది. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టాలి.

గొలుకొండ గోవింద, గోవిందమ్మ కాలనీ, అంకుపాలెం

వార్డులను మరింత అభివృద్ధి చేస్తా

- సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గణేష్ శంకుస్థాపన

నర్సీపట్నం: మున్సిపాలిటీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రధానంగా ఒకటో వార్డులో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. చాలా ఏళ్లగా అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చేస్తుండటంతో వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో పని లేకుండా రాజకీయాలకు అతీతంగా వార్డులోని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇక్కడ తన దృష్టికి తీసువచ్చిన గ్రావెల్ రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించానన్నారు. దశల వారీగా వార్డును మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కోట్లాది రూపాయలతో నర్సీపట్నం మెయిన్‌రోడ్డు, వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెద బొడ్డేపల్లి డాన్‌బాస్కో కళాశాల వరకు ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. ఈ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, వార్డు ఇన్‌చార్జి కృష్ణ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, డీఈ నారాయణ, ఏఈ రవికుమార్, పార్టీ నాయకులు లోకవరపు శారద, గంటా లలిత పాల్గొన్నారు.



పనులు ప్రారంభించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే గణేష్‌ను అభినందిస్తున్న వార్డు మహిళలు

పేదల వైద్యానికి పెద్ద పీట

నాతవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. ఆయన ఆదివారం చమ్మచింతలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఒక అడుగు వేస్తే తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి పేదల వైద్యానికి పూర్తి భరోసా కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించేందుకు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అన్నారు. రానున్న ఎన్నికల తర్వాత సీఎంగా జగన్ ఉండాలంటే, ఎమ్మెల్యే గణేష్‌ను ఇక్కడ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టరు అప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి

బీటీ రోడ్ల ఏర్పాటుకు విప్ ధర్మశ్రీకి వినతి



విప్ కరణం ధర్మశ్రీకి విన్నవిస్తున్న సర్పంచ్ కృష్ణంనాయుడు, గ్రామస్తులు

రోలుగుంట: తమ గ్రామాన్ని కలుపుతూ బీటీరోడ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కరణం ధర్మశ్రీని జానకిరాంపురం సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు కోరారు. ఆదివారం ఎస్.కొత్తూరులో ఆయన్ను కలసి వినతి పత్రం అందజేశారు. జానకిరాంపురం నుంచి కొండపాలెం వరకు నాలుగు కిలోమీటర్లు, జానకిరాంపురం నుంచి కాముడుపాలెం వరకు కిలోమీటరన్నర, జానకిరాంపురం నుంచి పడాలపాలెం వరకు కిలోమీటరు వరకు ప్రస్తుతం మెటల్ రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని, ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత ఏఈ మోహన్‌కు ఫోన్లో ఆదేశించారన్నారు. కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక పండగ

రావికమతం: మేడివాడలో నూకాంబిక అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా మార్గశిర మాసంలో ఈ పండగను గ్రామస్తులు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు పలు సౌకర్యాలు కల్పించారు.

ఘనంగా హిందూ సమ్మేళన సభ



హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న శ్రీకృష్ణచరణానంద భారతి స్వామి



మాడుగులలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకృష్ణచరణానంద భారతి స్వామి భక్తులనుద్దేశించి ఉపదేశించారు. హిందూ ధర్మ చాలా విశిష్టమైందన్నారు. గంగా మాత ఎప్పుడు పుట్టిందో ఇప్పటి వరకు ఏ శాస్త్రవేత్తలు కనుక్కోలేకపోయారన్నారు. అంతటి గొప్ప ధర్మం మనదన్నారు. అనంతరం సభ వేదిక నుంచి పాల్‌ఘాట్ సెంటర్ వరకు హనుమాన్ జెండాలతో అయోధ్య రాముని స్పర్శత అక్షింత కలశాలతో ఊరేగింపుగా జైశ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు. భవన బృందాల కళాకారులకు స్వామీజీ, జిల్లా కమిటీ సత్కారం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారు గంగాధర్, జిల్లా కన్వీనర్ చంద్ర మాలకొండయ్య, జిల్లా సహ కన్వీనర్ పాకలపాటి అరవింద్‌రాజు, బర్నికల దేవుడు, నాగబాబు పాల్గొన్నారు.

వేడుకగా శోభాయాత్ర

మాడుగుల/ రూరల్: అయోధ్య రాములోరి పూజిత పవిత్ర అక్షింతలను ఆదివారం రాత్రి గ్రామాల్లో ఊరేగించారు. వీహెచ్‌పీ, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో మాడుగులలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఈ పవిత్ర అక్షింతలను కె.జె.పురం, వీరవల్లిఅగ్రహారం, వీరనారాయణం, ఎం. కోడూరు, తదితర గ్రామాల్లో పుర వీధుల్లో ఊరేగించారు. వచ్చే జనవరి ఏడో తేదీ లోపు అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలంకి శ్రీనువాసరావు, వొలేటి సత్యనారాయణ తెలిపారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

రోలుగుంట: జనసేన పార్టీ కార్యకలాపాల కోసం ఆ పార్టీ కార్యాలయాన్ని రోలుగుంటలో ఏర్పాటు చేశారు. దీనిని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్, చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు, మండల శాఖ అధ్యక్షుడు బలిజి మహరాజు ఆదివారం ప్రారంభించారు. నాయకులు ఎ.త్రినాథ్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల సందడి

- విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తున్న చర్చిలు
- క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపిన విప్ ధర్మశ్రీ



విద్యుత్ కాంతులతో ముస్తాబైన చోడవరం గాంధీగ్రామం ఆర్సీఎం చర్చి

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/మాకవరపాలెం/నాతవరం/కె.కోటపాడు/దేవరాపల్లి: క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచే విద్యుత్ కాంతులతో చర్చిలన్నీ నక్షత్రాల వెలుతురులో ప్రకాశిస్తుండగా, కొనుగోలుదారులతో వస్త్ర దుకాణాలు, స్వీట్ స్టాళ్లు, బేకరీలు సందడిగా మారాయి. సోమవారం క్రిస్మస్ పండగ కావడంతో ముందు రోజు నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. కొవ్వొతులు వెలిగించి, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మేరీమాతగా, క్రిస్మస్ తాతగా వేషధారణ చేసి అందర్నీ అలరించి శుభాకాంక్షలు తెలిపారు. చర్చిల వద్ద ఏసు క్రీస్తు జననం సంబంధించిన సెట్‌లు వేసి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, గోవాడ సుగర్స్ ఎండీ వి. సన్యాసినాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

సరుగుడు పంచాయతీ రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో డి.యర్రవరం లో సాంస్కృతిక పాఠశాలలో విద్యార్థుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లి: నిస్సీ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టరు గొర్లె టైటస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దేవరాపల్లిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు కట్ చేశారు.



ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



కె.కోటపాడు: చిన్నారుల నృత్య ప్రదర్శన



విద్యుత్ కాంతులలో కొత్తకోట ఆర్సీఎం చర్చి



విద్యుత్ వెలుగులో బంగారుమెట్ట చర్చి



నాతవరం: వేషధారణలో విద్యార్థులు



మాకవరపాలెంలో క్రీస్తు సోదరుల ర్యాలీ

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సీపట్నం: కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఇక్కడ ప్రత్యేక పడకలను ఏర్పాటు చేశామన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ ప్లాంట్ ఉందన్నారు. వివిధ తీర్థయాత్రలకు వెళ్లి వచ్చిన భక్తులు ముందు జాగ్రత్త చర్యగా కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అవసరమైతేనే తప్ప అనవసరంగా బయటకు రాకపోవటమే మేలన్నారు. మార్కెట్‌కు వెళ్లినప్పుడు, జన సంచారం ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, గొంతునొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. గతంలో కోవిడ్‌తో బాధపడిన వారిపై ఈ వైరస్ ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి